క్లుప్తంగా

కింతలి నుంచి సంప్రదాయ గురుకులానికి బస్సు

శ్రీకాకుళం కల్చరల్: కల్లేపల్లిలోని సంప్రదాయ కూచిపూడి గురుకులానికి కింతలి గ్రామం నుంచి బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు సంప్రదాయం డైరెక్టర్ స్వాతీసోమనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీకి అనుబంధంగా నడుస్తున్న ఈ గురుకులంలో కూచిపూడి నృత్యం నేర్చుకునే అభిలాష ఉండే విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రతిరోజూ సాయంత్రం 4.30 గంటలకు కింతలి గ్రామంలో బస్సు బయలుదేరుతుందని, ఈ రూట్‌లో వచ్చే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9440681083, 7731909837 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

స్థల వివాదంపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్ : స్థల వివాదానికి సంబంధించి ఆదివారం పట్టణంలోని చాకలివీధిలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. తాతల కాలం నాటి రాజమ్మగుడి ఉండే ప్రాంతం తమదేనని సతివాడ రవికుమార్.. ఆ ప్రాంతం తమదేనని పాత ఇల్లు యజమాని నీలాపు పోలయ్య ఈ నెల 28న గొడవ పడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదుమేరకు ఇరువైపులా ఆదివారం కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఆలయ ధర్మకర్తకు సత్కారం


వెంకటిసాయిని సత్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: ఆనందపురంలో షిరిడీ సాయిబాబా ఆలయం ధర్మకర్త, మండల వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయిని ఆదివారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. రైతుల సమస్యలు పరిష్కరించడంతో పాటు ఎరువులు, విత్తనాల కోసం ప్రతి సమావేశంలో అధికారులకు నివేదిక ఇవ్వడం, సకాలంలో ఆర్బీకేలకు ఎరువులను తీసుకురావడంలోవ వెంకటిసాయి కృషి మరువలేనిదని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఇటీవల ఆనందపురంలో బాబా యాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బూరాడ వెంకటరమణ, పేడాడ శ్రీరామమూర్తి, కర్రి వైకుంఠేశ్వరరావు, చిత్తిరి మోహన్, సర్పంచులు సాకేటి నాగరాజు, చిత్తిరి మంజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో కోలాటం


కోలాటమాడుతున్న బాలికలు

జలుమూరు : మండల కేంద్రంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగంలో మాఘమాసం ద్వాదశ పురస్కరించుకుని ఆదివారం నరసన్నపేటకు చెందిన బాలికలతో కోలాటం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు భక్తి గీతాలు ఆలపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం


సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: కష్టాల్లో ఉన్న ఓ కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. మున్సిపాలిటీకి చెందిన ప్రసాద్ మహారణ 2004-05లో స్థానిక పాఠశాలలో పదో తరగతి చదువుకున్నారు. ఈయన కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు ఆదివారం అతని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఐదు వేల రూపాయల నగదు, రెండు బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు అందించారు. పూర్వ విద్యార్థులు కొవ్వూరు రాజేష్, లండ పాపారావు, రట్టి మనోజ్‌కుమార్, నెయ్యిల శివకుమార్, మార్పు శ్యామలరావు, సనపల హరి, సుడీయ అవినాష్, ధర్మరాజు ఉన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త

కొత్తూరు: అపరచిత వ్యక్తులు నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మురపాక గోవింద తెలిపారు. ఆదివారం కొత్తూరులో మాట్లాడారు. ఉపాధ్యాయుల పేరు చెప్పి డబ్బులు అడగడంతో కొంతమంది వారిపై ఉన్న గౌరవం, నమ్మకంతో రూ.వేలల్లో ఇస్తున్న వైనం గ్రామాల్లో జరుగుతుందన్నారు. ఇటీవల కొత్తూరు, హిరమండలం మండలాల్లో ఇటువంటివి రెండు సంఘటనలు జరిగాయన్నారు. పరిచయం లేని వ్యక్తులు ఇంటికి వచ్చి డబ్బులు అడిగినా, ఫోన్ పే చేయమన్నా అలా చేయవద్దన్నారు. డబ్బులు అడగమన్న వ్యక్తికి ఫోన్ చేసి నిర్ధారణ చేసుకోవాలన్నారు. కొంతమంది దుండగలు డబ్బులు కాజేసేందుకు ఇటువంటి చర్యలకు దిగుతున్నారన్నారు.

మంచు ముప్పు


మొక్కజొన్న, జీడి మామిడి పంటలకు మంచు ముప్పు పొంచి ఉంది. ఆదివారం వేకువజాము నుంచి ఉదయం 8 గంటల వరకు దట్టంగా పొగమంచు కురవడంతో పూతపై ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప, ఉల్లి, పెసర, మినుము, కూరగాయల పంటలకు నష్టం తప్పడం లేదని చెబుతున్నారు. - లావేరు

అంతర పంటలతో ఆదాయం


అంతర పంటలు రైతులకు అదనపు ఆదాయం అందిస్తున్నాయి. జి.సిగడాం మండలం బాతువ, పున్నాం, ఎందువ తదితర గ్రామాల్లో మామిడి, అరటి, పామాయిల్ వంటి తోటల్లో అంతర పంటలుగా రాగి, వేరుశనగ, ఖర్బూజా, కూరగాయలు వంటి పంటలను పండిస్తూ ఆదాయం పొందుతున్నారు. - జి.సిగడాం

అధిక దిగుబడులకు 'మల్చింగ్'


ఎస్ఎంపురంపేట (మెట్టపేట)లో ఆదివారం ప్రకృతి వ్యవసాయంలో భాగంగా టమాటా సాగులో మల్చింగ్ (భూమిని వరిగడ్డి, వ్యర్థాలతో కప్పడం) చేపట్టారు. దీనివల్ల సూర్య కిరణాల నుంచి పంటకు రక్షణ లభించడంతో పాటు దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మెట్ట ధనుంజయ తెలిపారు. - ఎచ్చెర్ల క్యాంపస్

విజయాదిత్య పార్కుకు మహర్దశ

- పార్కు అభివృద్ధికి రూ 2.54 కోట్లతో పరిపాలన ఆమోదం
- అత్యాధునిక హంగులతో సుందరీకరణ


విజయాదిత్యపార్కులో పూడికలతో దర్శనమిస్తున్న చెరువు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విజయాదిత్య పార్కు.. శ్రీకాకుళం నగరానికి ఆనుకుని సీపన్నాయుడుపేట ప్రాంతంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ పార్కు ఒకప్పుడు సుందరంగా ఉండేది. తర్వాత వివిధ కారణాల వల్ల కళా విహీనంగా మారింది. ఈ పార్కులోనే ఆహ్లాదకరమైన చెరువు ఉండేది. ఇప్పుడు పూర్తిగా పూడికలతో దర్శనమిస్తోంది. దీంతో నగరవాసులకు ఆహ్లాదం కరువైంది. ఈ నేపథ్యంలో అమృత్ 2.0 పథకం కింద విజయాదిత్య పార్కు, చెరువు అభివృద్ధికి రూ 2.54 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనామోదం లభించింది. ఇందులో రూ.67లక్షలు కేంద్రప్రభుత్వం నిధులు కాగా, రూ.1.35 కోట్లు 15వ ఫైనాన్స్ నిధులు, రూ. 52 లక్షలు కార్పొరేషన్ నిధులు. అభివృద్ధి పనులకు సంబంధించి డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్) తయారు చేయాల్సి ఉంది. ఆ తర్వాత ఆట వస్తువులు, కొలను గట్టు పటిష్టం చేయడం, సుందరమైన మొక్కలు ఏర్పాటు, అత్యాధునిక ఆట పరికరాలు, చెరువులో బోటింగ్ వంటి సౌకర్యాలు కల్పించేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

గత పాలకుల నిర్లక్ష్యం..

గతంలో నగరవాసులకు ఈ పార్కు అందుబాటులో ఉండేది. సాయంత్రం వేళ ఇక్కడికి వచ్చి సేదతీరేవారు. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల పూర్తిగా పాడైపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల సంక్షేమంతో పాటు వారి అభివృద్ధి పనులకు పెద్దపీట వేయడంలో


అస్తవ్యస్తంగా ఉన్న విజయాదిత్య పార్కు

భాగంగా ఈ పార్కును అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. శ్రీకాకుళం పరిధిలోని పెద్దపాడు చెరువును కూడా స్పాంజ్ సిటీలో భాగంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ తయారేచేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. డీసీసీబీలో కాలనీ చాపురం పరిధిలో సత్యసాయిరాం గుడికి ఆనుకుని ఉన్న ఎక్స్‌టెన్షన్ చెరువును అభివృద్ధి చేయాల్సి ఉందని అధికారులు అంటున్నారు. కార్పొరేషన్‌లో విలీన పంచాయతీలు ఏడింటిని కలుపుకొని అన్ని రకాల అభివృద్ధి పనులు చేసేందుకు మంత్రి ధర్మాన ప్రసాదరావు, కలెక్టర్ చొరవతో పనులు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఆహ్లాదం అందించడమే లక్ష్యం..


నగర వాసులకు ఆహ్లాదం అందించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. మంత్రి ధర్మాన ప్రసాదరావు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ల సూచనలు, సహకారంతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. విజయాదిత్య పార్కు అభివృద్ధికి ఇప్పటికే ప్రభుత్వం రూ 2.54 కోట్లకు పరిపాలనామోదం లభించింది. డీపీఆర్ తయారుచేసిన అనంతరం పనులు చేపట్టేందుకు చర్యలు చేపడతాం.

- చల్లా ఓబులేసు, శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రసంగం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీనాథుడు, తెనాలి రామకృష్ణ, చామకూర వెంకటకవులు, శ్రీరంగనాథుడు తమ రచనలలో శైలి, నైపుణ్యత, చమత్కారాలను అద్భుతంగా పండించారని డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో ఆదివారం కవితా చతురత అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం వక్తను సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ కోమలరావు, మందుల మోహనరావు, ఎం.శ్రీనివాసరావు, కె.చంద్రరావు, అరుణకుమారి, విశ్వేశ్వరరావు, బాబూరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

వైఎస్సార్ బీమాతో భరోసా

లావేరు: వైఎస్సార్ బీమా పథకంతో మృతుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని అప్పాపురం పంచాయతీ సర్పంచ్ జగ్గురోతు నాగరత్నం, వైఎస్సార్ సీపీ నాయకుడు జగ్గురోతు సత్యనారాయణ అన్నారు. అప్పాపురం గ్రామానికి చెందిన జగ్గురోతు సత్యవతి, ఆరుద్రలు ఇటీవల అనారోగ్య సమస్యతో మృతి చెందారు. వీరికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా పరిహారం మంజూరు కావడంతో ఆ మొత్తాన్ని ఆదివారం మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సంతోష్, నాయకులు రెడ్డి రామారావు, వలంటీర్లు పాల్గొన్నారు.


బీమా పరిహారం అందజేస్తున్న సర్పంచ్, నాయకులు

రక్తదానం అభినందనీయం


రక్తదానం చేస్తున్న యువకులు

గార: రక్తదానం చేయడం అభినందనీయమని గార సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం గారలో సత్యసాయి సేవా సంస్థలు, సత్యసాయి భజన మండళ్ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 30 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జోనల్ కన్వీనర్ పి.నాగేశ్వరరావు, న్యూ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, యూత్ కో ఆర్డినేటర్ కె.ఆదినారాయణ, గార భజన మండలి కన్వీనర్ కె.రాజు, రామారావు, సేవాదళ్ కో ఆర్డినేటర్ బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

ఎల్.ఎన్.పేట: ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా చదవాలని గ్రూప్-2 విజేత ఎం.వి.రమణమూర్తి అన్నారు. మండలంలోని డొంకల బడివంజ గ్రామంలోని ప్రజా గ్రంథాలయంలో ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు అధ్యక్షతన ఆదివారం విద్యార్థులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇష్టపడి చదివితే విషయం అర్థం అవుతుందన్నారు. పరీక్షలంటే భయం పోవాలని, నేను పరీక్ష రాయగలను, విజయం సాధించగలనన్న పట్టుదల ఉండాలన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు చెప్పింది విని విద్యార్థికి అర్థమయ్యేలా నోట్సు తయారు చేసుకోవాలన్నారు. నేర్చుకోవాలన్న తపన పెరగాలన్నారు. టిస్ సంస్థ అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు, సభ్యుడు రామశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ డ్రైవర్లు విధి నిర్వహణలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఏకాగ్రతతో బస్సులు నడపాలని శ్రీకాకుళం ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఆర్టీసీ 34వ రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వైఎస్సార్ కూడలి వరకు వైఎస్సార్ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తూ వారి మనస్సులో భద్రతకు మారుపేరుగా ఆర్టీసీ నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ సంస్థ పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు కె.మాధవ్, కె.ఎస్.ఆర్.శర్మ మాట్లాడుతూ స్వచ్ఛతా పఖ్వాడా నినాదంతో ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 2 వరకూ 34వ రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్ వంటి పనులు చేయరాదన్నారు. ముందున్న వాహనాలను ఓవర్‌టేక్ చేసేటపుడు, రద్దీ కూడళ్ల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.'వేగాన్ని నియంత్రించండి...వందేళ్లు వర్థిల్లండి, వాహనదారులూ హెల్మెట్ తప్పక ధరించాలని, నిదానమే ప్రధానం, రహదారి సూత్రాలు-రక్షణ కవచాలు, ఎర్రలైటు దాటిపోకు-జీవితాన్ని చేజార్చుకోకు.. అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, గంగరాజు, ఎస్ఎం వి.శామ్యూల్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఎస్.నాయుడు, ఆర్టీసీ పీఆర్‌ఓ కె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు భద్రతా ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు

వీనులవిందుగా పంచరత్న కీర్తనలు


త్యాగరాజు చిత్రపటంతో నగర సంకీర్తన

శ్రీకాకుళం కల్చరల్: త్యాగయ్య రచించి గానం చేసిన పంచరత్న కీర్తనల గానం వీనుల విందుగా సాగింది. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో కచ్చపి కళాక్షేత్రం ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు, దశమ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. యనమండ్ర శ్రీనివాసశర్మ, దూసి కనకమహాలక్ష్మీ, కరి యామినీకృష్ణ, సుసరాపు లక్ష్మీగణపతి శర్మ బృందం కీర్తనలను చక్కగా గానం చేశారు. ముందుగా పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయం నుంచి బాపూజీ కళామందిర్ వరకు త్యాగరాజస్వామి చిత్రపటంతో నగర సంకీర్తన సాగింది. అపర్ణ బృందంచే కోలాట ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం నాదసమ్మేళన కార్యక్రమంలో వై.శ్రీనివాసశర్మ కీర్తనలను గానం చేశారు. కార్యక్రమంలో బంకుపల్లి దుర్గా శ్రీనివాసశర్మ, మావుదూరు సూర్యప్రసాదరావు, మావుదూరు సత్యనారాయణశర్మ, ఇనపకుర్తి మన్మథరావు, దూసిరమేష్, దుంపల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పంచరత్న కీర్తనలను గానం చేస్తున్న దృశ్యం

మామిడి కాదు.. బొప్పాయి పండు


ఈ చిత్రంలో ఉన్నది మామిడి పండు ఆకారంలో ఉన్న బొప్పాయి పండు. కొత్తూరు మండల కేంద్రానికి చెందిన గేదెల తిరుపతిరావుకు చెందిన బొప్పాయి తోటలో ఆదివారం ఈ దృశ్యం కనిపించింది. - కొత్తూరు

4న కురేసిని అమ్మవారి సంబరం

కంచిలి: కుంబరినౌగాం పంచాయతీ పరిధి కొనక గ్రామంలో వెలసిన కురేసిని అమ్మవారి సంబర మహోత్సవాన్ని వచ్చేనెల నాలుగో తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకుడు, స్థానిక సర్పంచ్ నిత్యానంద జన్ని ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం ఏడు నుంచి మరుసటి దినం ఉదయం ఆరు గంటల వరకు అమ్మవారి సంబరాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. సంబరం సందర్భంగా అన్నదానం చేస్తామన్నారు.

కంచిలి పట్టణంలోకి రాని బస్సులు!

కంచిలి: మండల కేంద్రమైన కంచిలి పట్టణంలోకి రాకుండానే ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య చాలా రోజులుగా ఉంది. ప్రయాణికుల వినతి మేరకు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి ఈ సమస్యపై ఆర్టీసి ఉన్నతాధికారులకు గతంలో లేఖ రాశారు. దీనికి స్పందించిన అధికారులు కేవలం రాజమండ్రి డిపోకు చెందిన బస్సులకు మాత్రమే ఈ రూట్‌లో అనుమతి లేదని, మిగతా అన్ని సర్వీసులు కంచిలి మీదుగానే నడపాల్సి ఉందని స్పష్టత ఇచ్చారు. కానీ చాలా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కంచిలి పట్టణాన్ని తప్పించి బైపాస్ రోడ్డులోనే రోజూ రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి కంచిలి పట్టణంలోకి ఎక్స్‌సర్వీసులు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

టాలెంట్ టెస్టుకు అనూహ్య స్పందన

పలాస: బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన ప్రతిభ పరీక్షకు అనూహ్య స్పందన వచ్చింది. సుమారు మూడు వందల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యా సదస్సు కూడా జరిగింది. వేదిక అధ్యక్షుడు ఇసాకోటి జోగారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రధాన వక్తలుగా మానసిక వికాస నిపుణులు రామ్‌బుడ్డి గణపతి, పుక్కళ్ల చిరంజీవి, డాక్టరు టి.బాలకృష్ణ విద్యార్థులకు పలు సూచనలు సలహాలు చేశారు. కాగా టాలెంట్ టెస్టులో కొండప్ప ఇందు (ఒంకులూరు), గొరకల గణేష్ (రంగోయి), పసుపురెడ్డి సతీష్ (రంగోయి)మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తామాడ మదన్, బొడ్డు చిన్నారావు, కుత్తుం ప్రకాశరావు, బత్తిన ఓంకార్, రెయ్యి కృష్ణారావు, పి.బాలరాజు, బొడ్డు సుధాకర్, కామేశ్వరరావు, తెప్పల వాసుదేవరావు, తంగుడు ఖగేశ్వరరావు పాల్గొన్నారు.

పోటీతత్వం పెంపొందాలి

కవిటి: విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని బొరివంక ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు సనపల రామకృష్ణ అన్నారు. పాఠశాలలో మండలస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. కవిటి ప్రభుత్వ పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా.. రాజపురం ఏపీ మోడల్ స్కూల్ ద్వితీయ, రాజపురం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మూడోస్థానంలో నిలిచాయి. విజేతలకు పాఠశాల సిబ్బంది బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాంప్రసాద్‌పాల్గొన్నారు.

మొక్కజొన్న.. సాగు మిన్న


కేశవరాయునిపురంలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట

- ఎచ్చెర్ల నియోజకవర్గంలో 15 వేల ఎకరాల్లో సాగు
- లాభదాయకంగా ఉందంటున్న రైతులు

లావేరు: రైతులు సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి లాభదాయక పంటలవైపు దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా మొక్కజొన్న సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని లావేరు, రణస్థలం, జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల్లో సుమారు 15 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. మిగతా పంటల కంటే మొక్కజొన్న లాభదాయకంగా ఉందని పలువురు రైతులు చెబుతున్నారు. గతంలో కొద్ది గ్రామాల్లోనే మొక్కజొన్న సాగుచేసేవారు. మిగతా పంటలు కలిసి రాకపోవడంతో మొక్కజొన్నపై దృష్టి సారిస్తున్నారు. లావేరు మండలంలోని లింగాలవలస, లావేరు, గోవిందపురం, లావేటిపాలేం, జీజీవలస, కేశవరాయునిపురం, చినమురపా క, మురపాక, బుడుమూరు, ఇజ్జాడపాలెం, భరిణికాం , గుమడాం, వెంకటాపురం, పోతయ్యవలస, లుకలాపుపేట, రామునిపాలేం, అప్పాపురం, గురుగుబిల్లి, బెజ్జిపురం, అదపాక, కొత్తకుంకాం, పాత కుంకాం తదితర గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రభుత్వం సైతం గిట్టుబాటు ధర అందిస్తోందని రైతులు చెబుతున్నారు.